ప్రజాశక్తి
శనివారం 8 మార్చి 2025
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి

ప్రజాశక్తి-నెల్లూరు
రూరల్ నియోజకవర్గంలో 22 మందికి మంజూరైన రూ.28 లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బాధితులకు టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి అందజేశారు. శుక్రవారం రూరల్ నియోజకవర్గంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో బాధితులకు ఆయన చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని చికిత్సలు పొందిన వారితో పాటు ఇతర రాష్ట్రాల్లోని ఆసుపత్రుల్లో వైద్యం పొందిన పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరమన్నారు. పేదల ప్రయోజనాల దృష్టిలో ఉంచుకుని ఉదారంగా సాయం మంజూరు చేస్తున్న సీఎం నారా చంద్రబాబు నాయుడికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.



బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేస్తున్న దృశ్యం

జీతంలేని నిత్య కార్మికురాలు..!

◆కుటుంబ భారంలో సగం ఆమె
◆అన్ని రంగాల్లోనూ వివక్షే
◆నేడు అంతర్జాతీయ మహిళాదినోత్సవం

జీవిత బాధ్యతలతో నిత్యం కుటుంబాన్ని తన బుజాలపై మోస్తోంది...రాత్రింపగలు తేడా లేకుండా ఇంటిపని, బయటపనిలో జీతం లేకుండా నిత్యం కార్మికురాలుగా శ్రమిస్తోంది... అంతరిక్షంలో అద్భుతాలు సృష్టిస్తోన్న నేటి సమయంలో వివక్షతకు గురవుతునే ఉంది...రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాల్లో పురుషులకు ధీటుగా నిలబడాలని ప్రయత్నాలు చేస్తున్నా సమాజం ఒకింత వెనక్కి నెడుతూనే ఉంది.... పురుషాధిపత్య వ్యవస్థలో తమ స్థానమెక్కడో ఇప్పటికి స్పష్టం కాలేదు. ఒకప్పుడు కేవలం వంట ఇంటికే పరిమితమైన మహిళ నేడు అన్ని రంగాల్లోనూ రాణిస్తోంది. రాజకీయాల్లో మాత్రం పెద్దగా అవకాశాలు రావడం లేదు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కాగితాలకే పరిమితమవుతున్నాయి. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభలు, సమావేశాలు పెట్టి ఒక్కరోజు ఆకాశానికి ఎత్తుతారు. మహిళ శ్రమను గుర్తించి పురుషులతో సమాన హక్కులు కావాలని మహిళా లోకం అభ్యర్థిస్తోంది...

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి
నేటి తరం మహిళలు అన్ని రంగాల్లోనూ దూసుకుపోతున్నారు. పురుషులతో సమానంగా అంతరిక్ష యాత్ర కూడా చేస్తున్నారు. రైలు, బస్సు, ఓడ, ఆటో, కారు, ఒక్కటేమిటి ఏదైనా నడిపే సత్తా చాటుకున్నారు. ప్రధానంగా ఇంటిని తీర్చిదిద్దడంలో పురుషులతో సమానంగా కష్టపడుతున్నారు. కొందరు మహిళలు ఇంటిని తామే నడిపే పరిస్థితులు కనిపిస్తున్నాయి.అలాంటి రాజకీయాలలో నడవడం పెద్ద కష్టమేమికాదం టున్నారు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించాలనే ఎప్పటి నుంచో డిమాండ్ ఉన్నా అందుకు అన్ని రాజకీయపార్టీలు సహకారించకపోవడంతో ఎక్కడేసిన గొంగలి అక్కడే అన్నచందంగా ఉంది.స్థానిక సంస్థల్లో మాత్రం రిజర్వేషన్ ప్రక్రియ పాటిస్తున్నారు. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం ఏ రాజకీయ పార్టీ పాటించడం లేదు. ఈ దఫా ఎన్నికల్లో ఎన్నికల సంఘం రిజర్వేషన్లు కల్పించలేదు. తెలుగుదేశం పార్టీ మాత్రమే ఉమ్మడి జిల్లాలో కోవూరు, సూళ్లూరుపేట నుంచి మహిళలకు అవకాశం ఇచ్చింది. వైసిపి పూర్తిగా మరిచిపోయింది. టిడిపి, వైసిపి, కాంగ్రెస్ పార్టీల్లో 2019 ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల పరిశీలన సాగుతుంది. ఏ ఒక్క మహిళా అభ్యర్థికి అవకాశం ఇవ్వలేదు. రాజకీయాలు రాజ్యాంగం రిజర్వేషన్లు కల్పిస్తే తమ రాజకీయ పార్టీలు పెద్దగా పట్టించుకోవడం లేదు. జీవిత కాలంలో పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారు. రైల్వే సైతం పలు రంగాల్లో వ్యవసాయ రంగంలో అగ్రభాగం మహిళలదే. కలుపుతీయడం, నారు వేయడం, వంటి పనుల్లో కీలకంగా ఉంటున్నారు. పురుషులతో సమానంగా కూలీ పొందలేకపోతున్నారు. ఉపాధి హామీ పథకంలోనూ మహిళలే అగ్రగామి, భవన నిర్మాణ రంగంలో పురుషుల కన్నా ఎక్కువ మంది మహిళలే కనిపిస్తున్నారు. పురుషులు చేసే పనికి సమాన పనిచేస్తున్నా కూలీల్లో వ్యత్యాసాలు కనిపిస్తున్నానే ఉన్నాయి. ఇక ఇంటిపనుల్లో వారి శ్రమకు విలువ కట్టే పరిస్థితులు లేవు. ఉదయం నిద్ర లేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకు ఇంటిపనుల్లో ఒక్క క్షణం తీరికలేకుండా మహిళలు పనిచేస్తున్నారు. కొందరు భర్తలు మద్యానికి బానిసై కుటుంబాలను రోడ్డున పడేస్తే తానున్నానంటూ కుటుంబాన్ని అంతా తానై పోషిస్తోంది. ప్రభుత్వ రంగాల్లోనూ పురుషులతో సమానంగా మహిళా అధికారులు పనిచేస్తున్నారు. ఇది మరింత పెరగాల్సి ఉంది. సమాన హక్కుల కోసం ఎన్నో ఏళ్లుగా మహిళలు గొంతెత్తి ప్రశ్నిస్తూనే ఉన్నారు. ఎప్పుడో ఏదిని కోసారి మహిళ దినోత్సవం పేరుతో సభలు, సెమినార్లు సంబరాలు చేసుకోవడం కాకుండా అన్ని రంగాల్లో మహిళలను చేయిపట్టి ముందుకు నడిపించాల్సింది పురుషులే. రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలని మహిళలు కోరుతున్నారు. ఆరోజు త్వరగా రావాలని ఆశిద్దాం.

సబ్ కలెక్టర్‌కు జ్ఞాపిక అందజేత

ప్రజాశక్తి-కందుకూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి మెమెంటో అందజేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసిన సిద్ధార్థ స్కూల్స్ కరస్పాండెంట్ గొర్రెపాటి రామారావు, సిద్ధార్థ హై స్కూల్ ప్రైమరీ ఇంచార్జ్ కల్లూరి శైలజ . సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ కి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ హై స్కూల్ మహిళా టీచర్లు సుకన్య , పద్మ , రమణి , గాయత్రి , ఈశ్వరి , ముంతాజ్ , మల్లిక , కళ్యాణి , రాధా , జయలక్ష్మి , రజిని తదితరులు పాల్గొన్నారు.

భౌతికకాయం వద్ద బంధువుల రోధనలు

శోక సంద్రంలో...!
ముగిసిన అంత్యక్రియలు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి చెన్నయ్‌లోని రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుల మృతదేహాలకు శుక్రవారం నగరంలో అంత్యక్రియలు నిర్వహించారు. చెన్నయ్ శివారు ప్రాతంలో గురువారం తెల్లవారు జామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఇందులో నగరానికి చెందిన న్యాయవాది గుడుగుంట వేణుగోపాల్ కుమారుడు శ్రేయష్ (21) స్టాన్‌హౌస్‌పేటకు చెందిన సుధాకర్‌రెడ్డి కుమారుడు ఎర్రగుంట ధనిష్‌రెడ్డి (21) మృతి చెందారు. రాత్రి మృతదేహాలను చెన్నయ్ నుంచి నెల్లూరుకు తీసుకొచ్చారు. రిత్విక్ ఎన్‌క్యూ వద్ద శ్రేయష్ భౌతికకాయాన్ని చూడడానికి పెద్ద ఎత్తున స్నేహితులు, బంధువులు, తరలొచ్చారు. తల్లిదండ్రులు, బంధువుల రోధనలతో ఆ ప్రాంతం శోకసంద్రంగా మారింది. చిరుప్రాయంలో రోడ్డు ప్రమాదానికి గురికావడంతో అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు మృతదేహం చూసి కన్నీరుమున్నీరయ్యారు. రోడ్డు ప్రయాణాల్లో యువకులు జాగ్రత్తగా వ్యవహరించాలని పలువురు అభిప్రాయపడ్డారు. తల్లిదండ్రులు కుటుంబ సభ్యులను గర్తుచేసు కోవాలన్నారు. స్టాన్‌హౌస్‌పేటలో ధనిష్‌రెడ్డి అంతిమయాత్ర, అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

ధాన్యం మద్దతు ధరకు కొనాల్సిందే

..అశ్రద్ధచేస్తే చర్యలు ..కలెక్టర్ ఒ.ఆనంద్

మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి
జిల్లాలో రైతులు పండించిన పంటను ప్రభుత్వం ప్రకటించిన ఎంఎస్‌పి ధరలకు కొంటామని, అందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మిల్లర్లు ఎవరైనా తక్కువ ధరలకు కొంటే కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ ఒ. ఆనంద్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ హాల్లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సీజన్‌లో 11 లక్షల టన్నుల మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. ఇందులో 1.5 లక్షలు వ్యక్తిగత అవసరాలకు ఉపయోగిస్తే, మిగిలిన మార్కెట్‌కు వస్తాయనన్నారు. కొన్ని చోట్ల రైతులు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమేనన్నారు, జిల్లాలో ఆర్‌ఎన్‌ఆర్, బిపిటి, కెఎన్‌ఆర్ సాగుచేశారన్నారు.బిపిటి ధాన్యంలో కొంత ఇబ్బంది కలిగిందన్నారు. మిల్లర్లతో మాట్లాడడం జరిగిందని, ఎంఎస్‌పి కన్నా తక్కువకు కొనడానికి అవకాశం లేదని ఎక్కడైనా కొంటే కేసులు పెడతామని స్పష్టం చేశామని తెలిపారు. మిల్లర్లు, సిఎంఆర్, హాస్టల్, రేషన్‌షాపులకు మంచి బియ్యం ఇవ్వాలనే ఉద్దేశంతో కొనుగోలు చేస్తున్నామన్నారు. బిపిటిలో 5 లక్షల టన్నులు వస్తాయి అందులో 2.5 లక్షల టన్నులు కొనుగోలు చేస్తామన్నారు. షెడ్యూలింగ్ పై రైతులకు అవగాహన లేదన్నారు. రైతులు ముందుగా ధాన్యం అమ్మే విషయాలను ఆర్‌బికె, పిపిసి సెంటర్‌ల్లో తెలపాలని కోరారు. మిషన్ కటింగ్ కాబట్టి తడి కొంత ఉందని, దానిని కొనుగోలు చేయాలని మిల్లర్లకు ఆదేశాలిచ్చామన్నారు. 40 సెంటర్‌లో ఎంపిఎస్‌యు గోదాములున్నాయని, ఇక్కడ ధాన్యం నిలువచేసుకోడానికి అవకాశం ఇస్తున్నామన్నారు. మార్కెట్ యార్డ్‌లు వద్ద ధాన్యం నిల్వచేసుకోడానికి అవకాశం ఉందన్నారు. జిల్లా వ్యాపితంగా 300 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి కేంద్రంలో ముగ్గురు సిబ్బంది ఉన్నారన్నారు. సచివాలయం నుంచి సిబ్బందిని నియమించామన్నారు. 105 రైస్ మిల్లులు ఉన్నాయని, ప్రతి చోట రెవెన్యూ సిబ్బందిని ఆర్ఐ, టిటిఇ, విఆర్ఒ పెట్టామన్నారు. రైతులు ఎక్కడా తక్కువ ధరలకు అమ్మకోవద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. వారం లోపు 50 వేల టన్నులు కొనుగోలు చేస్తామన్నారు. రూ 20 కోట్లతో బ్యాంక్ గ్యారంటీ తీసుకున్నామని, లక్ష గోతాలు ఉన్నాయన్నారు. మూడు రోజుల్లో గోతాలు పెంచుతామన్నారు. రైతులకు ఇబ్బందులు పెట్టవదని, ప్రజలకు మంచి ధాన్యం వచ్చేలా మిల్లర్లు కృషిచేయాలన్నారు. హమాలీలు, గోతాలు, ట్రాన్స్‌పోర్టు పెట్టుకుంటే ప్రభుత్వమే అందజేస్తుందని తెలిపారు, ప్రభుత్వం రైతులకు తోడుగా ఉంటుందని ,ఎలాంటి అనుమానాలు, అపోహాలు వద్దని కోరారు. ధాన్యం అమ్మిన వెంటనే నగదు జమచేయడం జరుగుతుందన్నారు. ఈ-క్రాప్ లేకపోతే కొనుగోలు చేయలేమని స్పష్టం చేశారు., మీడియా సమావేశంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్ పాల్గొన్నారు.

22మందికి షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి-నెల్లూరు
నగర పాలక సంస్థ పరిధిలోని వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు, ఇన్‌ఛార్జ్ అడ్మిన్ కార్యదర్శులు 22 మందికి రెవెన్యూ వసూళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న కారణంతో కమిషనర్ సూర్య తేజ షోకాజ్ నోటీసులను శుక్రవారం జారీ చేశారు. కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వారి ఆదేశాల మేరకు ఈ నెల చివరి నాటికి కరెంట్ డిమాండ్ 100శాతం, అరియర్ డిమాండ్ 75శాతం పూర్తి చేయాలని నిర్దేశించారని తెలిపారు. అయితే ఈనెల 6వ తేదీన సూచించిన అడ్మిన్ కార్యదర్శులు జీరో వసూళ్లను చేయడంతో వారందరికీ షోకాజు నోటీసులు జారీ చేశామన్నారు.

పుట్టిన రోజు వేడుకలకు మాజీ హోంమంత్రి హాజరు

ప్రజాశక్తి- కందుకూరు
పట్టణంలో ప్రముఖ వ్యాపారవేత్త "గ్యాస్" కొండయ్య మనవడు మహదేవ్ పుట్టిన రోజు వేడుకలలో మాజీ హోంమంత్రి వసంత నాగేశ్వరరావు శుక్రవారం సందడి చేశారు. కొండయ్య కుమారుడు మధుశరణ్, సీత దంపతుల కుమారుడు మహదేవ్ మొదటి పుట్టిన రోజు వేడుకలను కందుకూరు వెంగమాంబ ఫంక్షన్ హాలు లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు . ఈ వేడుకలకు హాజరైన వసంత నాగేశ్వరరావు అందరితో కలివిడిగా గడిపారు.

మాట్లాడుతున్న ఏఓ రాము

పలుచోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అవగాహన

ప్రజాశక్తి-కందుకూరుమండలంలోని మోపాడు, మహాదేవపురం, పలుకూరు గ్రామాలలో మండల వ్యవసాయాధికారి వి రాము ఆధ్వర్యంలో రైతులకు ధాన్యం కొనుగోలు గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ కందుకూరు మండలంలో రబీ సీజన్లో మొత్తం 665 హెక్టార్ల వరి పంట వేయడం జరిగినది.ప్రస్తుతం పంట కోత దశలో ఉందని కావున రైతులు పౌర సరఫరా శాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ద్వారా ఏర్పాటు చేసిన ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముకోవాలన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సహాయ వ్యవసాయ సంచాలకులు డాక్టర్ పి అనసూయ మాట్లాడుతూ వరి పంట వేసిన ప్రతి ఒక్కరూ పంట నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డివిజనల్ కొఆపరేటివ్ ఆఫీసర్ కె.రామచంద్రారెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె. వి. సుబ్బారావు, తహశీల్దార్ ఇక్బాల్ అహ్మద్, కోఆపరేటివ్ జూనియర్ అసిస్టెంట్ కె లక్ష్మణ రావు, మోపాడు, పలుకురు పి ఎ సి ఎస్- సి ఇ ఓ లు సి .హరికృష్ణ,ఈ.శ్రీతేజ, రమణయ్య, ఈ.బ్రాహ్మణి, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుడ్లూరుగుడ్లూరులో రైతు సేవ కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి రవికుమార్ తెలియజేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వై వెంకటేశ్వరరావు అధ్యక్షతన రైతులతో అవగాహన సదస్సు శుక్రవారం జరిగింది. రైతు మిత్ర అధికారులు తేజశ్రీ సౌభాగ్యం స్థానిక రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు మండలంలో జి ల్లా కలెక్టర్ ఆనంద్ ఆదేశాల మేరకు ఎంఏఓ శిరీష రాణి శుక్రవారం గ్రామ సభలు నిర్వహించి రైతులకు ధా న్యం కొనుగోలు కేంద్రాలపై అవగా హన కల్పించారు. ఈ సందర్భంగా మండలంలో మొత్తం 14 ధాన్యం కొ లుగోలు కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని ఎంఏఓ శిరీష రాణి తె లిపారు.

ప్రజాశక్తి-వలేటివారిపాలెం:మండలం లోని పోకూరు గ్రామంలో రైతు సేవ కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశమయ్యారు. రైతుల ందరూ కూడా ప్రయివేటు దళారుల చేత మోసపోకుండా ప్రభుత్వం వారి ధాన్యం కొనుగోలు కేంద్రంలో అమ్ముకోవాలని సూచించారు.

వలేటివారిపాలెంలో

అనంతరం మండల వ్యవసాయ అధికారి హేమంత్ భరత్ కుమార్, మండల పరిషత్ డెవలప్మెంట్ ఆఫీసర్ వలేటివారిపాలెం వారి ఆధ్వర్యంలో పోకూరు, అంక భూపాలపురం గ్రామంలో ధాన్యం సేకరణ పై రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో కందుకూరు సబ్ కలెక్టర్ ఆఫీస్ డిప్యూటీ తహశీల్దార్ బ్రహ్మయ్య , పోకూరు గ్రామ రెవెన్యూ అధికారి మనోజ్ సీఈఓ మధు, వై సుష్మ, పి.నాగరాజు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉలవపాడు మండల పరిధిలో చాగొల్లు గ్రామం సచివాలయం పరిధిలో శుక్రవారం వ్యవసాయ శాఖ వారి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తహశీల్దార్ లావణ్య, మండల స్పెషల్ ఆఫీసర్ ఎం. వెంకట్రావు, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ నెల్లూరు వారు పాల్గొని మాట్లాడారు. ఈ అవకాశాన్ని ప్రతి రైతూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ లావణ్య

ప్రజాశక్తి-సైదాపురం మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహశీల్దార్, ఎంపిడిఓ, ఎంఏఓలు పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద గ్రామ సభ ఏర్పాటు చేశారు. రైతులతో మద్దతు ధర వివరాలు, షెడ్యూలింగ్ విధి విధానాలు, తేమ శాతం పరిశీలన క్వింటా ధర పుట్టి ధర గ్రేడ్ ఏ రకానికి రూ.19720,సాధారణ రకానికి రూ. 19,550 ఉందని రైతులందరికీ అవగాహన కల్పించారు.

మండలిలో నూర్ బాషాలకు అవకాశం కల్పించాలి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :శాసనమండలిలో నూర్ బాషా సోదరులకు అవకాశం క ల్పించాలని ముస్లిం నూర్ బాషా సంక్షేమ సంఘం నెల్లూ రు జిల్లా యువత ప్రధాన కార్యదర్శి, తెలుగుదేశం పార్టీ ముస్లిం నూర్ భాషా సాధికార సమితి తిరుపతి పార్ల మెంట్ కన్వీనర్ షేక్. అల్తాఫ్ బాషా విజ్ఞప్తి చేశారు. శుక్ర వారం ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావే శంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శా సన సభ్యుల కోటాలో సభ్యుల ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నూర్ బాషా సోదరులకు శాసనమండలి సభ్యు నిగా అవకాశం కల్పించాలని కోరారు.

ఉచిత వైద్యపరీక్షలు

ప్రజాశక్తి -ఉలవపాడు అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా శనివారం ఉలవపాడు లోని సర్ యూస్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత గర్భసంచి కేన్సర్ పరీక్షలు నిర్వహించ బడుతుందని డాక్టర్. జె సుస్మిత తెలిపారు. సరయూస్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ హెచ్. సి.జి. ఎం.ఎన్. ఆర్ కేన్సర్ సెంటర్ ఒంగోలు వారి సంయుక్త ఆధ్వర్యంలో జరుగు ఈ ఉచిత శిబిరంలో ఎం.ఎన్.ఆర్ ప్రముఖ కేన్సర్ వైద్యనిపుణులు డాక్టరు ఆళ్ల. దీప్తి ఒంగోలు, సరయు మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టరు సుస్మిత పాల్గొని ఉచిత పరీక్షలు నిర్వహించి తగు సూచనలు, సలహాలు అందించ బడును. ఈ అవకాశాన్ని ఉలవపాడు మండల పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించు వలసినదిగా కోరారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - లింగసముద్రంవిద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 95 సర్వీస్ లకు గాను నాలుగు లక్షల పైన అపరాధ రుసుమును విధించినట్లు కందుకూరు డివిజన్ ఎక్సికేటివ్ మరియు విజిలెన్స్ ఎం.నాగేశ్వర రావు,ఈఈ టి.హైమావతి తెలిపారు.శుక్రవారం స్థానిక లింగసముద్రం సబ్ స్టేషన్ లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం చేయుట చట్టరీత్య నేరం అన్నారు.మండలంలోని పెద్దపవని, చిన్నపవని మొగిలిచర్ల, విఆర్.కోట, అన్నెబోయినపల్లి, అంగరేకుల పాడు, ఆర్ ఆర్.పాలెం,నరసింహపురం, మరికొన్ని గ్రామాలలో మొత్తం 90 మంది సిబ్బంది 29 బందాలుగా ఏర్పడి 2865 సర్వీసులను తనిఖీ చేయగా నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ వాడకంతో పాటు చౌర్యానికి పాల్పడిన వారికి అపరాధ రుసువు విధించారు.ఇటువంటి వారిపై చర్యలు తప్పవని ఈఈ టి.హైమవతి గారు హెచ్చరించడం జరిగినది. ఈ దాడులలో కందుకూరు ఈఈ,ఎం. నాగేశ్వరరావు,కందుకూరు రూరల్ డిఈఈ ఆర్.విజయ బాబు, లింగసముద్రం ఏఈ షేక్ ఫిరోజ్, పలువురు ఏడిఏలు,ఏఈ లు,సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ స్టేషన్‌లో మాట్లాడుతున్న అధికారులు

కాలువల్లో పూడిక తీయాలి

ప్రజాశక్తి-నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో డ్రెయిను కాలువల పూడికతీత పనులను క్రమం తప్పకుండా చేపట్టాలని, పూడికతీత అనంతరం రోడ్లపై సిల్ట్ వ్యర్థాలు లేకుండా వెంటనే తొలగించాలని కమిషనర్ సూర్య తేజ ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా శుక్రవారం నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీ.ఎం. సూర్య తేజ13వ డివిజన్ గౌడ హాస్టల్ సెంటర్, బాలాజీ నగర్, దర్గా వీధి, బ్యాంకు కాలనీ, రెయిన్బో నగర్, గ్యాస్ గోడౌన్ సెంటర్ ప్రాంతాలలో పర్యటించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, డాక్టర్ చైతన్య, ప్రదీప్ కుమార్, రఘురాం,కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

కాలువను పరిశీలిస్తున్న కమిషనర్

నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరురాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో 120 మైక్రోన్లకన్నా తక్కువ స్థాయి గల సింగల్ యూజ్డ్ ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీ, రవాణా, విక్రయం తదితరాలను ని షేధిస్తున్నట్లు అదనపు కమిషనర్ వై.ఓ నందన్ స్పష్టం చేశారు. ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీదారులు, రిటైలర్లు, ఇతర విక్రయదారులతో ప్రత్యేక సమావేశాన్ని కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో శుక్రవారం నిర్వహించారు.

ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు

ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీలో

నెల్లూరులో

గుడ్లూరులో

వలేటివారిపాలెంలో

ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలలో
ప్రజాశక్తి-కందుకూరు
కందుకూరు ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్చి 7 , 8, 2025 తేదీల్లో మహిళా విద్యార్థినులు, మహిళా బోధకుల కోసం ప్రత్యేక క్రీడా పోటీలు ప్రారంభించారు. మహిళల శారీరక, మానసిక సామర్థ్యాన్ని పెంపొందించేలా ఈ క్రీడా పోటీలు ఏర్పాటు చేయబడినట్లు నిర్వాహకులు తెలిపారు. క్యారమ్, చెస్, టగ్ ఆఫ్ వార్, ఖో ఖో, థ్రోబాల్, టెన్నికాయిట్ వంటి క్రీడలు నిర్వహించగా, ఇవాళ జరిగే పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లు రేపటి ఫైనల్స్‌కు అర్హత సాధించాయి. కళాశాల కరస్పాండెంట్ డా. కె. రామయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. సమాజంలో మహిళలకు గల విలువను గుర్తించి, ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాల్సిన బాధ్యత ఉందని తెలిపారు.కళాశాల సాంకేతిక సంచాలకుడు డా. కె. విజయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, "మహిళలు సమాజంలో కీలక పాత్ర పోషించేవారు మరియు వారి ఆత్మవిశ్వాసం, శక్తి ప్రతి రంగంలో మేధావులు, నాయకులుగా మిగిలిపోయేలా చేస్తుంది," అని చెప్పారు. క్రీడా పోటీలను అకడమిక్ ఇన్‌ఛార్జ్ మీరవలి, ఎంబీఏ విభాగాధిపతి డా. కె. పవని సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు .రేపటి ఫైనల్స్‌లో విజేతలకు బహుమతులు అందజేయనున్నారు.

ప్రజాశక్తి-కందుకూరు
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కందుకూరు శ్రీ రామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజని, ఆర్డీవో టీవీఎస్ లక్ష్మీని, మున్సిపల్ కమిషనర్ కే అనూషని కలిసి ఘనంగా సన్మానించారు. ఆల్ ఇండియా వాసవి సత్ర సముదాయాల మీడియా చైర్మన్ డాక్టర్ చక్కా వెంకట కేశవరావు, శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ రవ్వా శ్రీనివాసులు మాట్లాడారు.కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ రవ్వా అరుణ, జాయింట్ సెక్రెటరీ జయవరపు కనకమహాలక్ష్మి, సొసైటీ అడ్వైజర్ రవ్వా వెంకట సాయిలక్ష్మి, సొసైటీ సభ్యులు గుర్రం మనస్విని, జయవరపు కిషోర్, శ్రీ కోదండ రామాలయం మెంబర్ గుర్రం చిన్న అల్లూరయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి-నెల్లూరు అంతర్జాతీయ మహిళా దినోత్సవం శనివారం కస్తూర్బా కళాక్షేత్రంలో జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఓ .ఆనంద్ తెలిపారు. ఈ సందర్భంగా కస్తూర్బా కళాక్షేత్రంలో మహిళల కోసం పలు కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉదయం 10 గంటలకు మహిళా దినోత్సవం ప్రారంభమవుతుందని, ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు ,మహిళ సంఘాలు, పొదుపు సంఘాలు ,మహిళలు హాజరవుతారని ఆయన తెలిపారు.

ప్రజాశక్తి-వలేటివారిపాలెంసానిక స్టేట్ బ్యాంక్ శాఖ మేనేజర్ నరేష్ బాబు, సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బ్యాంక్ ఆవరణలో కందుకూరు అత్తోట హస్పిటల్, శారదా హస్పిటల్, సంకల్ప హస్పిటల్ డాక్టర్లచే మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్లు సౌందర్య, వాసవి, శివరిలు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల సమావేశంలో మేనేజర్ నరేష్ బాబు మాట్లాడుతూ మహిళలు ఏ రంగంలోకూడా తక్కువ కాదని నిరూపిస్తున్నారని తెలిపారు.కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-నెల్లూరు టిడిపి కూటమి ప్రభుత్వం మహిళలను ద్రోహం చేసిందని వైసిపి రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి మల్లినిర్మల అన్నారు. శుక్రవారం నగరంలోని డైకస్‌రోడ్డులో ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా దినోత్సవ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి సంతోషకరమైన వార్తలను చెప్పి శుభాకాంక్షలు చెప్పదలుచుకున్నదో తెలియజే యాలన్నారు.

ప్రజాశక్తి-గుడ్లూరుమానవ సమాజంలో సమాన హక్కుల కోసం మహిళలు పోరాడాలని యునాని వైద్యశాల డాక్టర్ విమల తెలియజేశారు. గుడ్లూరు లోని ప్రభుత్వ వైద్య ఆరోగ్య కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో శుక్రవారం ఆమె ప్రసంగించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వై వెంకటేశ్వరావు, డాక్టర్ విమల పీహెచ్‌ఈఎల్ వరలక్ష్మి, హెచ్‌డి సారమ్మలను ఘనంగా సన్మానించారు. ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నారాయణ నర్సింగ్
ప్రజాశక్తి-నెల్లూరు సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ ఆఫీస్ నెల్లూరు వారి ఆధ్వర్యంలో నారాయణ నర్సింగ్ కళాశాల వారి సహకారంతో మహిళా దినోత్సవ సందర్భంగా శుక్రవారం నారాయణ నర్సింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో క్షేత్ర ప్రచార సహాయకులు పి హరికృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. శాస్త్ర సాంకేతిక విద్య వైద్య ఉపాధి రంగాల్లో ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం మహిళలకు తోడు ఉందని అన్నారు. వివిధ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ బి.వనజ కుమారి, సిడబ్ల్యుసి చైర్మన్ మాధవి, ప్రభుత్వ న్యాయవాది రమాదేవి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్. లోకాదాలత్ సభ్యులు మాలకొండారెడ్డి మరియు విద్యార్థులు, ఉపాధ్యాలు పెద్ద సంఖ్య లో పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెడితే క్రిమినల్ కేసులు

ప్రజాశక్తి-నెల్లూరు
ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదని, సంబంధిత రైస్ మిల్లర్ల పై క్రిమినల్ కేసులు పెట్టాల్సి వస్తుందని కలెక్టర్ ఒ. ఆనంద్ హెచ్చరించారు. శుక్రవారం కలెక్టర్ వారి ఛాంబర్ లో రైస్ మిల్ అసోసియేషన్ ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు కు సంబంధించి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర ను రైతు కు చెల్లించాల్సిందేనన్నారు. అంతకంటే తక్కువకు కొనుగోలు చేస్తే ఆయా దళారులు, వ్యాపారుల పై తీవ్ర చర్యలు ఉంటాయన్నారు. మిల్లర్లు పై కేసులు పెట్టే వరకు పరిస్థితి ని తీసుకురావద్దన్నారు. రైతులు, వ్యాపారులు ఉభయులు నష్టపోకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఉన్నదన్నారు.సమావేశం లో జాయింట్ కలెక్టర్ కార్తీక్, డి ఎస్ ఒ అంకయ్య, పౌర సరఫరాల సంస్థ డియం అర్జున్ రావు, వివిధ రైస్ మిల్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

మిల్లర్లతో తహశీల్దారు సమావేశం

ప్రజాశక్తి-కోవూరు : ప్రస్తుతం కోవూరు మండలంలో ధాన్యం కోతల సీజన్ ప్రారంభమైందని, దానిని దృష్టిలో పెట్టుకుని జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో కోవూరు మండలంలో ఉన్న రైస్ మిల్లర్ల యాజమాన్యంతో తహశీల్దార్ నిర్మలానందబాబా ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ బ్యాంక్ గ్యారెంటీ పొందిన ప్రతి మిల్లు యాజమాని రైతు సేవా కేంద్రాలకు నాణ్యమైన గోతాలను తప్పక అందజేయాలన్నారు. ముఖ్యంగా రైతులు రైస్ మిల్లుకు ధాన్యం తెచ్చిన సమయంలో ఎక్కువ సేపు నిరీక్షణ లేకుండా నకాలంలో ధాన్యాన్ని అన్లోడ్ చేసేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. తేమశాతం 17 ఉంటే ప్రభుత్వం ప్రకటించిన ధర వస్తుందని, అనంతరం తేమ శాతం పోరిగే కొద్దీ ఒక కేజీ చొప్పున మిల్లర్లు తీసుకోవాలన్నారు. మిల్లర్లు కూడా రైతుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని వారికి పూర్తిస్థాయిలో సహకరించాలన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార బాలకోటమ్మ, పడుగుపాడు సొసైటీ సిఇఒ గోవర్ధన్‌రెడ్డి, మండలంలోని రైస్‌మిల్లు అసోసియేషన్ నాయకులు యజమానులు పాల్గొన్నారు.

'పిఎంశ్రీ' నిధులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-నెల్లూరు : జిల్లాలో పిఎంశ్రీ (ప్రైమ్ మినిస్టర్స్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకం ద్వారా ఎంపికైన పాఠశాలలకు మంజూరైన నిధులను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఒ.ఆనంద్ హెచ్‌ఎంలకు సూచించారు. శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో పిఎంశ్రీ నిధుల వినియోగం, పాఠశాలల్లో పెండింగ్‌లో వున్న అభివృద్ధి పనులపై సమగ్రశిక్ష ఇంజినీర్లు, హెచ్‌ఎంలతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో సమగ్రశిక్ష ఎపిసి వెంకటసుబ్బయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు సుబ్బరాయులు, ఎఎం సుధీర్‌బాబు, పాఠశాలల హెచ్‌ఎంలు, సమగ్రశిక్ష ఇంజినీర్లు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-కోవూరు : జిల్లాలోని అన్ని పంచాయతీల కార్యదర్శులు ఇంటి పన్నులు, కుళాయి పన్నులు తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఇన్‌ఛార్జి డిపిఒ డాక్టర్ పి.రమణయ్య అన్నాడ కోవూరు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం సెలవు రోజు అయినా పంచాయతీ రాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న 722 గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను తప్పక నిర్వహించాలన్నారు. అదే సమయంలో ఇంటింటికి వెళ్లి పన్నుల వసూళ్ల చేయడం చెత్తను తడి చెత్త, పొడి చెత్త రూపంలో చెత్త నుసంపద కేంద్రాలకు చేర్చడం, వాటికి సంబంధించిన ఫొటోలు తీసి కమిషనర్ యాప్లో తప్పక నమోదు చేయాలన్నారు. అదేవిధంగా శనివారం నాలుగు డివిజన్లకు సంబంధించి స్వమిత్రపై శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నామని, ఈ శిబిరాలను పంచాయతీ విస్తరణాధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరు కావాలన్నారు. జిల్లాలోని అన్ని పంచాయతీలు మార్చి 10వ తేదీలోగా 60శాతం పన్నులు, క్ష్మ 25వ తేదీలోగా నూరుశాతం పన్నులు వసూలు చేయాలని నిర్ణయించామన్నారు.

10న 'రైతులకు అండగా.. వైసిపి జెండా'

ప్రజాశక్తి కొడవలూరు : 10వ తేదీన చేపట్టే రైతులకు అండగా.. వైసిపి జెండా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాజీ డిసిఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు కోరారు. ఆయన శుక్రవారం నార్త్ రాజుపాలెంలోని విసిఆర్ గెస్ట్ హౌస్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడిచినా కానీ రైతులను పట్టించుకోకుండా ఎన్నికల హామీలను నెరవేర్చకుండా విఫలమైందన్నారు. రైతులను అన్నివిధాలుగా ఆదుకున్న ప్రభుత్వం వైసిపి ప్రభుత్వమే అన్నారు. రైతులు పక్షాన నిలబడి రైతులకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ 10వ తేదీ సోమవారం విడవలూరు తహశీల్దార్ కార్యాలయం తహశీల్దారు వినతిపత్రం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీలకు అతీతంగా రైతులు ప్రజా సంఘాలు రైతు అనుబంధ సంస్థలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గం లోని అన్ని మండలాల వైసిపి కన్వీనర్లు, నాయకులు కార్యకర్తలు, కొడవలూరు ఎంపిపి గాలి జ్యోతి, నార్త్ రాజుపాలెం సర్పంచి బొచ్చు సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి నిధులు

ప్రజాశక్తి-బిట్రగుంట : కొండ బిట్రగుంట గ్రామంలో వెలిసి శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం రూ.కోటి 60లక్షల నిధులతో కార్యక్రమాలు చేస్తున్నామని ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ దాతల సహకారంతో కొండ బిట్రగుంట గ్రామం ఆలయం అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సహకారం, కొండ బిట్రగుంట చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి, కార్యనిర్వహణ అధికారి రాధాకృష్ణ దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు రావి విజయ్ యాదవ్, మాజీ ఎంపిటిసి చిలకపాటి వెంకటేశ్వర్లు, తుళ్లూరి సురేష్‌బాబు, ఎంపిడిఒ సుబ్రహ్మణ్యం, ఎల్లక్రిష్ణ ఎఇ జఠరయ్య, ఎన్వి బొజ్జ, రమేష్ యాదవ్, వెంకటేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పలకలు పంపిణీ

ప్రజాశక్తి-బిట్రగుంట : కోవూరుపల్లి సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ నిధుల నిర్వహిస్తున్న మద్ది శ్యామ్ సుధాకర్ ప్రథమ కుమార్తె లెన్ని శ్రేష్ఠ 4వ జన్మదిన వేడుక సందర్భంగా శుక్రవారం బోగోలు కుమ్మరి వీధి అంగన్‌వాడీ కేంద్రంలో తోటి విద్యార్థులకు పలకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిజిటల్ అసిస్టెంట్ శ్యామ్ సుధాకర్ మాట్లాడుతూ పాప పుట్టినరోజున ఇంట్లో కాకుండా చదువుకునే పాఠశాలలో తోటి విద్యార్థులతో కలిసి జరుపుకోవడం పాపకి ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. కార్యక్రమంలో లెన్ని శ్రేష్ఠ కుటుంబ సభ్యులు, మేనమామ కల్యాణ్, అంగన్‌వాడీ టీచర్ మనీజా, అంగన్‌వాడి హెల్పర్ శేషమ్మ ఆశ వర్కర్ బిరెడ్డి అరుణ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి ఇందుకూరుపేట : అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి బిసిసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండా అనిల్ విచ్చేసి విద్యార్థులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ చారిటబుల్ ట్రస్ట్ పేరుతో ట్రస్ట్ వ్యవస్థాపకులు దొడ్ల మల్లికార్జున్ ఎన్నో మహోత్తర కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ప్రవీణ్, సంపత్ సురేష్, విద్యా కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు శిక్షణ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : మండలంలోని కరటంపాడు ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రంలో శుక్రవారం ఎఎస్‌పేట ఎంపిడిఒ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో విస్తరణాధికారి, పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్వహించడంపై ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రకృతి వ్యవసాయం కోఆర్డినేటర్ సుబ్బారావు ప్రకృతి వ్యవసాయం గురించి వివరించారు. అనంతరం శనివారం మహిళా గ్రీన్ అంబాసిడర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్, రాష్ట్ర టిడిపి కార్యదర్శి దావా పెంచలరావు, గార్లపాటి సోమన్‌రాజు నాయుడు, ఎఎస్ పేట ఇఒఆర్‌డి రమేష్, ప్రణాళిక ఎ.ఒ ఎం.కృష్ణ, షేక్ షఫీ, కరటంపాడు సర్పంచ్ పి.రేవతి పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-కోవూరు : మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల మేరకు.. కన్న కొడుకు పెళ్లి చేసుకోవటం నిరాకరించడంతో తాను మనస్తాపానికి గురై పెళ్లికి తనకున్న చుండుగుంట గ్రామానికి చెందిన ఎన్.సుజన (49) 5వ తేదీ పురుగుల మందు తాగింది. ఈ మేరకు ఆమెను హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. కొడుకు శ్రీకాంత్ పెళ్లి చేసుకోకుండుటే దానిని సాధించలేక తల్లి విషం తాగి ఆయినా కొడుకును మార్చాలని తపనతో విషం తాగింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను పాపిరెడ్డి ఆస్పత్రికి తరలించారు అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు శుక్రవారం ట్రైనీ డిఎస్‌పి ఆస్పత్రికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేశారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : మండలంలోని మల్లి కార్యుపురం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గిరిజనులకు పైలెట్ ప్రాజెక్టు ప్రకటించి ప్రత్యేక ఆధార్ సెంటర్ ను కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఐటిడిఎ పిఒ బి. మల్లికా రుద్ర రెడ్డి మాట్లాడుతూ మండలంలో శనివారం నుండి సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సూచనలు, సలహాల మేరకు ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్థానిక టిడిపి నేత తాళ్లూరు జీవర త్నం, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మాలి

పలుచోట్ల రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టిన అధికారులు

మర్రిపాడులో...

ప్రజాశక్తి-మర్రిపాడు : రైతులు పండించిన పంటలకు మద్దతు ధరకల్పించేందుకు, దళారులు, మధ్యవర్తుల చేతుల్లో రైతులు నష్టపోకుండా రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ అనిల్‌కుమార్ యాదవ్ తెలియజేశారు. మండలంలో బూదవాడ ప్రాథమిక వ్యవసాయ సహకారపరపతి సంఘంలో కొనుగోలు కేంద్రంను ఏర్పాటు చేయగా బూడవాడ, బ్రాహ్మణపల్లి, ఇర్లపాడు, కంపసముద్రం, చిలకపాడు, సింగనపల్లి రైతులు, భీమవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పరిధిలో భీమవరం, డిసిపల్లి, రామానాయుడపల్లి, చినమాచనూరు, చుంచులూరు, అల్లంపాడు, నందవరం, పిఎన్‌పల్లి, పొంగూరు గ్రామాల్లోని రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవచ్చన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేస్తారని, రైతులు ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాలకు లోబడే విధంగా మెరుగుపరచు కోవాలన్నారు. ఈ పంట నవోదయ ఈ కెవైసి పూర్తి చేసుకున్న రైతుల వద్ద మాత్రమే ధాన్యం కొనుగోలు చేస్తారన్నారు. సాధారణ రకం ధాన్యం పుట్టికి రూ.19550, గ్రేడ్ ఏ రకం రూ.19720 ఇస్తుందన్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు వారి ఆధార్ అనుసంధానమైన బ్యాంకు అకౌంట్లో నేరుగా డబ్బులు జమ చేస్తారన్నారు. ధాన్యం సేకరణకు అవసరమైన గోనెసంచులను ఉచితంగా సరఫరా చేసి రవాణా కూలీ ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందని తెలియజేశారు.

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని భీమవరం రైతు సేవా కేంద్రంలో రైతులకు వరి కొనుగోలు కేంద్రాలపై తహశీల్దార్ అనిల్ కుమార్యాదవ్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి వైవి నాగేశ్వర ప్రసాద్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కోతకు సిద్ధంగా ఉన్న రైతులు రైతు సేవా కేంద్రంలోని వ్యవసాయ సహాయకులను సంప్రదించి షెడ్యూల్ చేయించుకొని కూపన్ పొందాలని మండల వ్యవసాయ అధికారి ఎస్ రామమోహన్ తెలియజేశారు.

ప్రజాశక్తి-వింజమూరు : మండలంలోని సాకలకొండ, గుండెమడక గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని వ్యవసాయ అధికారి ఎం.శ్రీహరి నారాయణ తెలిపారు. రైతులు పండించిన ధాన్యానికి ధరను అందించి అండగా నిలిచేందుకు కొనుగోలు కేంద్రాలను ఆయా గ్రామాలలోని పిఎసిఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సదవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపిడిఒ, తహశీల్దారు, వ్యవసాయ అధికారి, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని 12 సచివాలయాల పరిధిలో ఉన్న గ్రామాలలో వరి కొనుగోలు కేంద్రాలపై ఎంపిడిఒ అప్పాజీ సమక్షంలో మండల వ్యవసాయ అధికారి ఆంజనేయనాయక్ గ్రామసభ నిర్వహించారు. శుక్రవారం మండల పరిధిలోని గుడినడవ గ్రామంలో నిర్వహించిన వరి కొనుగోలు కేంద్రలలో వరి పంట వేసిన రైతులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ కొల్లుబోయిన కృష్ణ, మండల డెవలప్మెంట్ ఆఫీసర్, సొసైటి సిఇఒ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : మండలంలోని చెర్లోఎడవల్లి గ్రామంలో రైతు సేవా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి ఆత్మకూరు వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆత్మకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు దేవసేనమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తమ పండించిన ధాన్యాన్ని, దళారులకు, తక్కువ ధరకు అమ్ముకోకుండా, ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరతో కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముకోవాలన్నారు. మండల వ్యవసాయ అధికారి కిషోర్ బాబు మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాల గురించి శాంపిల్ సేకరణ మిల్లుకు ధాన్యం సరఫరాపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విఎఎ ప్రత్యూష చెర్లో ఎడవల్లి గ్రామ రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్ పేర్కొన్నారు. మండలంలోని అప్పారావుపాళెం, బట్టేపాడు రైతు సేవాకేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఎఎస్‌పేట మండలంలోని శ్రీకొలను, గుంపర్లపాడు, అనుముసముద్రం గ్రామ రైతు సేవా కేంద్రాలలో మండల వ్యవసాయ అధికారిని టి.రజిని రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం రైతులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఎఇఒ కె.చిరంజీవి, విఎఎలు కె.తులసి, శ్రీనాథ్, శ్రీహరి రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి కోవూరు : కోవూరులోని రైతు సేవా కేంద్రంలో గురువారం కేంద్రం పరిధిలోని రైతులతో సహయ వ్యవసాయ సంచాలకులు సుజాత ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని 17శాతం వచ్చే వరకు ఆరబెట్టాల్సిన అవసరం లేదని, తేమ శాతం బట్టి ధర నిర్ణయిస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధిరిణి ఇందిరావతి ఉన్నారు.

ప్రజాశక్తి-కలిగిరి : మండలంలోని రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ముసునూరు సురేష్ బాబు, ఎంపిడిఒ ప్రత్యూష, తహశీల్దారు రవీంద్రబాబు సూచించారు. వెలగపాడు, పోలంపాడు గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లోని రైతులకు ఎంపిడిఒ ప్రత్యూష, కలిగిరి -1, 2, నాగసముద్రం రైతు సేవా కేంద్రాల పరిధిలో వ్యవసాయాధికారి సురేష్ బాబు, కృష్ణారెడ్డి పాలెం, పెద్ద కొండూరులో తహశీల్దారు రవీంద్రబాబు రైతులతో శుక్రవారం అవగాహన సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో విఎఎలు వెంకటేశ్వర్లు, కొండలరావు, అనూష, సుజాత, వెంకటేశ్వర్లు రెడ్డి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని బోగోలు తహశీల్దార్ సురేష్ బాబు అన్నారు. శుక్రవారం బేతానీయపేటలోని ప్యాడి పెక్యూర్ సెంటర్లో ఏర్పాటు చేసిన సమావేశంలో తహశీల్దార్ సురేష్‌బాబు మాట్లాడుతూ రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను దళారుల నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మాలపాటి నాగేశ్వరరావు, మాజీ ఎంపిటిసి ముంతాల వెంకయ్య, రైతులు, మండల అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-జలదంకి : రైతులు తాము పండించిన ధాన్యాన్ని నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముకోవాలని తహశీల్దార్ ప్రమీల పేర్కొన్నారు. మండల వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం ధాన్యం కొనుగోలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. వింజమూరు సబ్ డివిజన్ వ్యవసాయ అధికారి ఎన్.రామిరెడ్డి, ఎంపిడిఒ బ్రహ్మయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో తహశీల్దార్ ప్రమీల కొనుగోలు కేంద్రాలలో ధాన్యం అమ్ముకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారిని బి శైలజ, మండలంలోని గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి వరికుంటపాడు : రబీ సాగు చేసిన రైతులు ప్రయివేట్ మార్కెట్లో ధాన్యం ధర తక్కువగా ఉంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా కనీస మద్దతు ధర పొందవచ్చని తహశీల్దార్ హేమంత్ కుమార్ తెలియజేశారు. మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో శుక్రవారం రైతులకు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల సేవలను అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి రవికుమార్ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా జరుగుతున్న ఈ కొనుగోలు కేంద్రాలలో రైతులు తమ ధాన్యం నాణ్యత ప్రమాణాలను పరిశీలించుకొని విక్రయించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి నాగూర్ వల్లీ, మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వెంకటాద్రి, సొసైటీ సిబ్బంది మాల్యాద్రి, వ్యవసాయ సహాయకులు కూండ్ల చంద్రశేఖర్ పవన్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విడవలూరు తహశీల్దారు చంద్రశేఖర్

ప్రజాశక్తి-విడవలూరు : మండల పరిధిలోని విడవలూరు, పార్లపల్లి, అన్నారెడ్డిపాలెం పంచాయతీలలో రైతులకు ధాన్యం కొనుగోలుపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం తహశీల్దార్ చంద్రశేఖర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రూ.1970లకు విక్రయించవచ్చన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతులు కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం అమ్మేలా చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

కల్లాల వద్దే ధాన్యం అమ్మేస్తున్న రైతులు

ప్రభుత్వం పెద్దఎత్తున ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన రైతులు వాటికి వెళ్లకుండా ప్రయివేట్ వ్యక్తులకే ఎందుకు విక్రయిస్తున్నారని, అందుకోసం ప్రభుత్వం ఏ విధమైన చర్యలు తీసుకుంటే రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వెళ్తారని ఎపి రైతు సంఘం నాయకులు లక్కు ప్రసాద్ ప్రశ్నించారు. జిల్లా వ్యాప్తంగా 6లక్షల ఎకరాల్లో వరి పండిస్తున్నారని, ఇప్పటి వరకు 2 లక్షల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయని, పుట్టి రూ.18,300 లేదా 18,200లకు విక్రయిస్తున్నారని ప్రభుత్వం రూ.19,720లు ఇస్తామని చెబుతున్నా ఎందుకు విక్రయించడం లేదన్నారు. ప్రభుత్వం నిర్ధేశించిన మార్గదర్శకాల ప్రకారం 17శాతం కంటే తక్కువ తేమ శాతం ఉంటేనే కొనుగోలు చేస్తామని చెబుతున్నారని, వరికోతలు కోసిన తరువాత రెండు రోజులు ఆరబోస్తేనే 17శాతం కంటే తక్కువ తేమశాతం వస్తుందని పేర్కొన్నారు. రెండు రోజులు ఆరబోసిన ధాన్యాన్ని మళ్లీ గోతాలకు ఎత్తాలంటే రూ.1700 ఖర్చు అవుతుందని, అయితే ధాన్యం ఆరబోసుకునేందుకు ప్రభుత్వం సరైన వసతులు కల్పించకపోవడంతోనే రైతులు ఇలా ప్రయివేట్ వ్యక్తులకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోందన్నారు. ప్రయివేట్ వ్యాపారులు వరికోతల వద్దకు వచ్చి కొనుగోలు చేసి తక్కువ ధర ఇచ్చినా మిగిలిన ఖర్చులకు అది సరిపోవడంతో అధిక శ్రమ లేదనే కారణంతోనే ఇలా చేస్తున్నారని తెలుస్తోందన్నారు. ఒక పుట్టికి 850 కిలోలు ధాన్యం తూకం వేయాలని, కానీ 920 కిలోల వంతున ధాన్యం తీసుకుంటున్నారని, ఈ దోపిడి విధానాన్ని ప్రభుత్వం నిలువరించే చర్యలు చేపట్టాలని కోరుతున్నామన్నారు.

రిజర్వాయర్లకు నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

నెల్లూరు, ప్రకాశం జిల్లాలోని మెట్ట ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించేందుకు వెలగొండలో అంతర్భాగమైన పెదిరెడ్డిపల్లి సీతారామసాగర్ రిజర్వాయర్లకు రూ.7వేలకోట్లు నిధులు కేటాయించాలని సీతారామసాగర్ సాధన కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సీతారాంసాగర్ సాధన కమిటీ సభ్యులు కాకు వెంకటయ్య మాట్లాడుతూ జరుగుతున్న బడ్జెట్ సమావేశాల్లో రిజర్వాయర్‌లకు రూ.7వేల కోట్లు కేటాయించి త్వరితగతిన పూర్తి చేయాలని వారు కోరారు. ప్రభుత్వం ప్రస్తుత బడ్జెట్లో రూ.394 కోట్లు కేటాయించడం దుర్మార్గమన్నారు.

మాట్లాడుతున్న కాకు వెంకటయ్య

ఇప్పటికైనా ఈ ప్రాంత మంత్రులు శాసనసభ్యులు అసెంబ్లీలో చర్చ పెట్టి ప్రజలకు రైతులకు సాగు, తాగునీరు అందించేందుకు కృషి చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రభుత్వంకు వ్యతిరేకంగా ప్రజల తరపున పెద్దఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రాంతీయ కార్యదర్శి కోడె రమణయ్య, తదితర రైతులు, నాయకులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లపై ఉక్కుపాదం

ప్రజాశక్తి-కావలి

మాట్లాడుతున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి

అక్రమ లేఅవుట్లపై ఉక్కుపాదం మోపుతానని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన కావలి పట్టణంలోని ఎమ్ఐజి లేఅవుట్‌ను సందర్శించారు. అనంతరం పోలీస్ అతిథి గృహంలో మీడియాతో మాట్లాడారు. గత వైసిపి పాలనలో భూ కుంభకోణాలు విపరీతంగా జరిగాయన్నారు. జిల్లాలో ఎక్కువ అక్రమాలు జరిగింది కావలిలోనే అని అన్నారు. కావలి పురపాలక పరిధిలో రూ.700 కోట్లు విలువైన 128 ఎకరాల ప్రభుత్వ భూములను కబ్జా చేశారన్నారు. వాటిని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు కావలి ఎంఎల్ఎతో కలిసి ప్రత్యేకంగా చర్చిస్తామన్నారు. అక్రమ లేఅవుట్‌లో దారులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి భూ యజమానుల దగ్గర నుంచి రెండు రూపాయల వడ్డీతో అసలు కలిపి చెల్లించేలా కృషి చేస్తామన్నారు. ఎంఐజి లేఅవుట్‌లో అన్ని వసతులు కల్పిస్తామన్నారు. తాను ఎప్పుడూ ఎవరికి లొంగనని రాజీలేని పోరాటం చేస్తానన్నారు. కార్యక్రమంలో అధికారులు, నుడా వైస్ చైర్మన్ సూర్యతేజ, ఆర్‌డిఒ ఎం.సన్నీ వంశీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్, టిడిపి పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్ బాబు, టీడీపీ సీనియర్ నాయకుడు భవనాసి సురేష్, నాయకులు, అధికారులు ఉన్నారు.



దుర్గమ్మ సేవలో టిడిపి నాయకులు

ప్రజాశక్తి-ఆత్మకూర్ అర్బన్

విజయవాడలోని ప్రముఖ పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని శుక్రవారం ఆత్మకూరు పట్టణానికి చెందిన టిడిపి నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి వద్ద మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. టిడిపి పట్టణ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి, రూరల్ మండల ప్రధాన కార్యదర్శి కేత విజయభాస్కర్ రెడ్డి, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు పిటికటి వెంకటేశ్వర్లు నాయుడు అమ్మవారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

ఆర్‌డిఒ తనిఖీలు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలంలోని కుప్పూరుపాడు గ్రామపంచాయతీలో జరుగుతున్న రీ సర్వే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జరుగుతున్న గ్రామసభను ఆకస్మికంగా ఆత్మకూరు ఆర్‌డిఒ పావని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజవోలు సొసైటీకి సంబంధించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎన్ని ఏర్పాటు చేసి ఉన్నారు, రీసర్వేకు సంబంధించి అన్ని విషయాలను అధికారులను, రైతులను అడిగి తెలుసుకున్నారు. దళారులకు ధాన్యాన్ని అమ్మొద్దని వ్యాఖ్యానించారు.

పలుచోట్ల మహిళా దినోత్సవ వేడుకలు

జక్కా శేషమ్మకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

కుటుంబ వ్యవస్థలో మహిళదే కీలక బాధ్యత అని కోవూరు ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని బుచ్చిరెడ్డిపాలెంలో శుక్రవారం బహిరంగ సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థకు మూలం మహిళ అని, ఆమె మార్చి 8వ తేదీన ఒక్కరోజు మాత్రమే మహిళా దినోత్సవం జరుపుకోకూడదని ప్రతిరోజు మహిళా దినోత్సవం జరుపుకోవాలని పిలుపునిచ్చారు. నేటి సమాజంలో మహిళలు పురుషులకు పోటీపడి అన్నిరంగాల్లో రాణించటం సంతోషకరంగా ఉందన్నారు. అనంతరం పలు రంగాల్లో రాణించిన మహిళలను, బాలికలను ఆమె సత్కరించారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, జెడ్‌పిటిసి సురా ప్రదీప, మహిళా కౌన్సిలర్లు, సర్పంచులు నాయకురాలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం కడనూతల గ్రామంలోని ఆర్‌ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పివిఎస్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ అపోలో హాస్పిటల్ నెల్లూరులో సీనియర్ పలమనాలజిస్ట్ గా పని చేస్తున్న డాక్టర్ శ్రావణిరెడ్డి, కోవూరు ఎపిఎస్‌పిడిసిఎల్‌లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఎం.తేజశృతి, ఆర్ఎస్ఆర్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ వి.చంద్ర జ్యోతిలను సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ఎఒఆర్‌వి రమణారెడ్డి, ఉమెన్ ఎంపవర్మెంట్ అన్ని డిపార్ట్మెంట్ల కోఆర్డినేటర్స్, మహిళా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు ఐసిడిఎస్ కార్యాలయంలో శుక్రవారం ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను సి.డి.పి.ఒ పి.సునీలత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తల కు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు సిడిపిఒ పి.సునీలత బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం అంగన్వాడీ కార్యకర్తలు సిడిపిఒ సునీలత, సూపర్‌వైజర్లను శాలువాలు, పుష్పగుచాలు, జ్ఞాపికాలతో ఘనంగా సన్మానించారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కమిటీ ప్రధాన కార్యదర్శి పి.రాధను కూడా వారు ఘనంగా సన్మానించారు. అందరూ ఆనందోత్సాహాలతో కోలాహలంగా పండుగ వాతావరణంలో ఈ వేడుకలను జరుపు కున్నారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు నారాయ ణమ్మ, నాగేశ్వరమ్మ, విజయలక్ష్మి, కస్తూరి, రమాదేవి, సురేఖ, పద్మావతి, ఆత్మకూరు, ఎఎస్‌పేట, సంగం, చేజర్ల మండలాల అంగన్‌వాడీలున్నారు.

ప్రజాశక్తి-కావలి : స్థానిక డి.బి.ఎస్. ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్ నాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వి.రావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జి రమేష్ బాబు, లేడీ ఫ్యాకల్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మహిళల రక్షణ గురించి వక్తృత్వ పోటీలను, మ్యూజికల్ చైర్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్ నాయుడు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ దాసరి శివసాగర్ కుమార్, విద్యార్థినిలు, ఆల్ డిపార్ట్మెంట్ లేడీ ఫ్యాక్టరీ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జవహర్ భారతి డిగ్రీ కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం మహిళలు, విద్యార్థినులు కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ (ఇన్‌ఛార్జ్) మరియు ఉమెన్ ఎంపవర్‌మెంట్ విభాగం కోఆర్డినేటర్ వి.వసుంధరా దేవి మాట్లాడుతూ 2025 సంవత్సరం ఉమెన్స్ డే థీమ్ ఆక్సెల రేట్ యాక్షన్ ప్రకారం మహిళలందరూ ఉన్నత విద్యను అభ్యసించి అత్యున్నత స్థాయిలో నిలవాలన్నారు. కార్యక్రమంలో స్వయం ఉపాధి కోర్సుల డైరెక్టర్ డాక్టర్ ఆర్.మాల్యాద్రి, కళాశాల యాజమాన్యం విశ్వోదయ రెక్టార్ డి.వినయ్ కుమార్ రెడ్డి, డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ వి.సుధాకర్ రెడ్డి, మహిళా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.



ప్రజాశక్తి-కావలి : మహిళల మౌలిక సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా ఉద్యమిద్దామని స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్.శ్యామల పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 8వ వార్డు మున్సిపల్ హైస్కూల్లో స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో శుక్రవారం సభ నిర్వహించారు. సభలో రిటైర్డ్ హెచ్.ఎం.సత్యనారాయణ, మహిళా అభ్యుదయ వాది ఉమాశర్మ, బిఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగి రావి.కోటిరెడ్డి, ఇంగ్లీష్ టీచర్ లక్ష్మీ పావని పాల్గొని మాట్లాడారు. ఈ సభకు ఇన్‌ఛార్జి హెచ్‌ఎం రాఘవేంద్రరావు అధ్యక్షత వహించారు.

ప్రజాశక్తి-కావలి : స్థానిక రవి నర్సింగ్ హోమ్‌లో శుక్రవారం జెవివి జిల్లా నాయకురాలు జి.కల్యాణి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన జెవివి సమతా వింగ్ రాష్ట్ర నాయకులు విజయమ్మ మాట్లాడుతూ ఈ ప్రత్యేకమైన రోజున మహిళల విజయాలను, పోరాటాలను, వారి త్యాగాలను స్మరించుకోవడం మనందరి కర్తవ్యమన్నారు. మహిళ సాధికారత నిరంతర ప్రక్రియ అని, మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మహిళలపై హింసను అరికట్టడానికి కఠిన చర్యలు తీసుకోవాలని, మహిళలు సమాజంలో అన్ని రంగాలలో సమాన అవకాశాలు పొందాలని, ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా శక్తివంతం కావాలని, స్త్రీపురుషులు సమానమన్నారు. సమావేశంలో పట్టణ జెవివి గౌరవాధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్, అధ్యక్షులు తోట.వెంకటేశ్వర్లు, కార్యదర్శి గాదిరెడ్డి.హరినాథ్, కోశాధికారి టి.సుబ్బరామ శర్మ, జెవివి జిల్లా నాయకులు పాపిశెట్టి జానకిరామ్, గాదిరెడ్డి మురళీకృష్ణ, కలయిక విజ్ఞాన సంస్థ వ్యవస్థాపకులు లావణ్య దంపతులు, ఉమాశర్మ, కల్లయ్య, పి.వి.ఎన్.సుధాకర్, ఎం వి.రమణయ్య, జెవివి మహిళా నాయకులు సి.శారద, స్వర్ణలత, ఎస్. కె. ఖాదర్ బి, యుటిఎఫ్ రాష్ట్ర నాయకురాలు బి. శ్రీదేవి, వాసవి లెజెండ్స్ నిర్వాహకులు, గ్రీన్ హెల్పింగ్ హాండ్స్ నిర్వాహకులు గాయత్రి, జెవివి కార్యవర్గ సభ్యులు, కార్మిక మహిళలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

9న వార్షికోత్సవ సభ

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

కమ్యూనిటీ పారామెడిక్ వెల్ఫేర్ అసోసియేషన్ నెల్లూరు గ్రామీణ వైద్యుల 8వ వార్షికోత్సవ సభ 9వ తేదీ ఆదివారం అభిరాం హోటల్‌లో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 10 గంటల వరకు జరుగుతుందని కమ్యూనిటీ పారామెడికల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్ కాజా మియా పత్రికా ముఖంగా తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఉన్నటువంటి 200 మంది గ్రామీణ వైద్యులతో సమావేశం ఏర్పాటు చేసుకుంటున్నట్లు, అలాగే ఈ కార్యక్రమానికి గ్రామీణ వైద్యులు రాష్ట్ర ఫెడరేషన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, నాయకులు పాల్గొంటారని తెలియజేశారు. కావున జిల్లాలో ఉన్నటువంటి గ్రామీణ వైద్యులు అలాగే కమిటీ సభ్యులు, నాయకులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No: 110/2021

బూదాటి సత్యనారాయణ మరికొందరు ...వాదులు

Vs

బూదాటి శివలక్ష్మి@లక్ష్మి మరికొందరు..ప్రతివాదులు

To

D22) కాందాటి పద్మావతి
W/o వరదరాజులు, గాండ్ల వీధి,
నవాబ్ పేట, నెల్లూరు టౌన్.

పై నంబరు దావాని వాదులు షెడ్యూల్ ఆస్తిలో బాగా పంపిణీ నిమిత్తం దాఖలు చేసి మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారని శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వులు మేరకు మీరు తేది :28-03-2025న ఉదయం 10.30 నుండి సాయంత్రం 5.00 గంటల లోపు పై కోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకునేది. లేనిచో దావాని మీపరోక్షముగా తీర్మానింపబడును.

// కోర్టు వారికి ఉత్తర్వులతో //

అద్దంకి
తేది : 07-03-2025

ఇట్లు
మోతుకూరి శుభాష్ బాబు
మురకొండ చంద్రశేఖర్
అడ్వకేట్స్, అద్దంకి